క్లుప్తంగా

త్వరలో సోలార్ వెలుగులు



మొగిలి ఘాట్ రోడ్డులో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ స్తంభాలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి ఘాట్ రోడ్డులో త్వరలో సోలార్ లైట్లు వెలగనున్నాయి. మొగిలి ఘాట్ ప్రమాదాల నివారణలో భాగంగా సోలార్ లైట్లను ఏర్పాటు చేపట్టారు. దొరచెరువు నుంచి మొగిలి గ్రామానికి వెళ్లే రోడ్డు వరకు సోలా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి లైట్లు అమర్చారు. త్వరలో వాటికి బ్యాటరీలు అమర్చి లైట్లు వెలిగించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు.

దేవర ఎద్దుకు వైద్యం



దేవర ఎద్దుతో పాటు డాక్టర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

గుడిపాల: దేవర ఎద్దుకు శస్త్ర చికిత్స చేసి కాపాడడంతో గ్రామస్తులు పశువైద్యాధికారి డాక్టర్ సాయిసుధను సన్మానించారు. మండలంలోని ఓ.వెంకటాపురంలో ప్రతి సంవత్సరం దేవరెద్దుకు ఘనంగా పూజలు నిర్వహిస్తుంటారు. ఆ దేవర ఎద్దు క్యాన్సర్ గడ్డతో బాధపడుతోంది. దీనికి సంబంధించి చికిత్సలు చేసిన డాక్టర్ సాయిసుధ క్యాన్సర్ గడ్డను తొలగించారు. ఆ దేవర ఎద్దును కాపాడిన డాక్టర్‌ను గ్రామస్తులందరూ కలిసి సన్మానించారు.

వేరుశనగ విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

ఐరాల: ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న వేరుశనగ విత్తన కాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వీహెచ్ఏ రామచైతన్య అన్నారు. మండలంలోని పుత్రమద్ది ఆర్ఎస్‌కేలో శనివారం సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలను రైతులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో వర్షాధార పంటగా రైతులు వేరుశనగ పంట సాగు చేయాలన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలను పంపిణీ చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

రాయితీపై పశు దాణా పంపిణీ



దాణాను పంపిణీ చేస్తున్న దృశ్యం

గుడిపాల: పాడి రైతులకు ప్రభుత్వం 50శాతం రాయితీపై పశుదాణాను అందజేస్తోందని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని బొమ్మసముద్రం, గుడిపాల పశువైద్యాధికారులు రవితేజ, సాయిసుధ తెలిపారు. బొమ్మసముద్రం, వసంతాపురం, పాపసముద్రం రైతుసేవా కేంద్రాల్లో శనివారం వారు పాడి రైతులకు పశుదాణాను అందజేశారు. వారు మాట్లాడుతూ తెల్లరేషన్ కార్డు గల పాడి రైతులకు ఈ దాణాను అందజేస్తున్నట్లు తెలిపారు. నిరంతరం ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. పాడి రైతు ముందుగానే నగదును చెల్లించినట్లయితే ఆ తరువాత 10 రోజుల్లో దాణాను అందజేస్తామన్నారు. ఆయనతో పాటు పశువైద్య సిబ్బంది కిషోర్, అబ్దుల్లా, జ్యోత్స, రైతులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉండాలి

ఐరాల: ఉమ్మడి జిల్లాలోని మామిడి రైతుల పక్షాన ప్రభుత్వం, జిల్లా కలెక్టర్లు అండగా నిలబడాలని మండలానికి చెందిన సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉంటామంటూ పత్రిక ప్రకటనల ద్వారా లక్ష లాది రూపాయలు ఖర్చు పెడుతూ ప్రకటనలు చేస్తున్నప్పటికీ మామిడి రైతులకు ఏ మాత్రం న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.





కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి స్వర్ణరథోత్సవం శనివారం రాత్రి వైభవంగా సాగింది. ఈ ఉత్సవంలో కోలాట కళాకారులు తమ ప్రతిభతో భక్తులను ఆకట్టుకున్నారు. ఉదయం సంకటహర చతుర్థి వ్రతానికి భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. ఉదయం నుంచే భక్తులు స్వామివారి దర్శనానికి పోటెత్తారు. దీంతో ఆలయంలోని క్యూలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయం వెలుపల కూడా భక్తులు బారులు తీరారు. - కాణిపాకం

నడకయాతన

కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచినా గ్రామీణ రోడ్లకు మోక్షం రాలేదు. గ్రామీణ రోడ్లు దుస్థితికి చేరుకోవడంతో ప్రజలు, వాహనాలు తిరగలేక నానా అవస్థలు పడుతున్నారు. తవణంపల్లె పీహెచ్‌సీ నుంచి రామకృష్ణాపురం వరకు ఉన్న రోడ్డు కంకర తేలింది. కూటమి నాయకులు జేసీబీ యంత్రంతో రోడ్డును చదును చేసే ప్రక్రియలో గుల్ల పూర్తిగా పైకిలేచిపోయింది. టి.పుత్తూరు రోడ్డు నుంచి కొండకింద కనికాపురం వరకు ఉన్న రోడ్డు కూడా కంకర తేలింది. గత ఏడేళ్లుగా ఈ రోడ్ల పనులు ముందుకు సాగలేదు. మండలంలోని కాణిపాకం నుంచి ఉత్తరబ్రాహ్మణపల్లె వరకు ఉన్న లింకు రోడ్డు అడుగడుగునా గుంతలమయంగా మారింది. తవణంపల్లె నుంచి టి.పుత్తూరు మీదుగా చిగరాకులపల్లె వరకు ఉన్న రోడ్డు గుంతలమయమైంది. ముట్టుకూరు నుంచి రామానాయుడు పాళ్యం వరకు ఉన్న మట్టిరోడ్డు అధ్వానంగా ఉంది. దిగువమోదలపల్లె నుంచి నలిశెట్టిపల్లె వరకు ఉన్న రోడ్డు మరమ్మతులకు గురైంది. - సాక్షి టాస్క్‌ఫోర్స్



కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచుకోని రోడ్డు



కాణిపాకం మార్గంలో పుణ్యసముద్రం వద్ద గోతులు ఏర్పడిన రోడ్డు



యాదీపల్లె రోడ్డులో గుంతలు ఏర్పడడంతో వాహనాలు నడపడానికి ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



తవణంపల్లె పీహెచ్‌సీ నుంచి రామకృష్ణాపురం వరకు కంకర తేలిన రోడ్డు

సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నాం





గుడిపాల: వైద్యసేవలందిస్తున్న డాక్టర్ సంధ్య, తవణంపల్లె: వైద్యసేవలందిస్తున్న డాక్టర్ కేశవనారాయణ

గుడిపాల: ప్రతి గ్రామంలో సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నామని డాక్టర్ సంధ్య అన్నారు. రామభద్రాపురం గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ వైద్యసేవలు అందించనున్నట్లు చెప్పారు. హెల్త్ క్లినిక్‌ల ద్వారా మంచం పట్టిన రోగుల ఇంటి వద్దకే వెళ్లి వైద్యం చేస్తున్నట్లు వివరించారు. అనంతరం గర్భిణులు, షుగర్ పేషెంట్‌లకు వైద్య చికిత్సలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. 66 మంది రోగులకు చికిత్సలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది అనిత, అనురాధ, కాంచన, శివగామి పాల్గొన్నారు.

అధిక రక్తపోటు రాకుండా జాగ్రత్తపడాలి

తవణంపల్లె: అధిక రక్తపోటు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని చారాల గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలిచ్చారు. వృద్ధాప్యంలో అధిక రక్తపోటు రాకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొనన్నారు.

పల్లెల్లో పరిశుభ్రత పాటించాలి

పల్లెల్లో పరిశుభ్రత పాటించి వ్యాధులు సోకకుండా చర్యలు చేపట్టాలని వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ తెలిపారు. మండలంలోని కారకాంపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మామిడి రైతులను ఆదుకుంటాం



పండ్ల పరిశ్రమ యూనిట్‌ను పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవడానికి రాయితీ రూపంలో రూ.168కోట్లు చెల్లిస్తుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మండలంలోని గొల్లమడుగులో శనివారం మామిడికాయలు నిల్వ ఉంచిన పండ్ల పరిశ్రమ గోదాములను ఆయన పరిశీలించారు. మామిడికాయ జ్యూస్ ఎలా తయారవుతుందో పరిశీలించారు. అనంతరం మామిడి రైతులతో కొంతసేపు ముచ్చటించారు. రైతులను అన్నివిధాలా ఆదుకోవడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీ ప్రసాద్‌రావు, హార్టికల్చర్ సెక్రటరీ రాజశేఖర్‌బాబు, కమిషనర్ శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సంకటహర చతుర్థి

గుడిపాల: మండలంలోని వసంతాపురంలో సుందర వినాయకస్వామి దేవాలయంలో శనివారం ఘనంగా సంకటహర చతుర్థి నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివారికి పూజలతో పాటు అభిషేకం చేశారు. మహిళలు పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని భక్తిపాటలను పాడారు. అనంతరం వారి మొక్కులను చెల్లించుకున్నారు. తీర్థప్రసాదాలు భక్తులకు అందించారు.



సంకటహర చతుర్థి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు